క్లుప్తంగా

అన్న ప్రసాద వితరణ

ప్రొద్దుటూరు : స్థానిక అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో సోమవారం మధ్యాహ్నం శివోహం అన్నప్రసాద సేవా సంఘం ఆధ్వర్యంలో అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. పట్టణానికి చెందిన కమ్మర భాను ప్రకాష్ జన్మదినం సందర్భంగా తల్లిదండ్రులు హైమావతి, చంద్రమోహన్ సహకారంతో అన్నప్రసాద వితరణ సేవా కార్యక్రమం నిర్వహించినట్లు సంఘం అధ్యక్షుడు శెట్టిపల్లె రాంప్రసాద్ రెడ్డి తెలిపారు. సుమారు 500 మంది అన్నప్రసాదాన్ని స్వీకరించినట్లు ఆయన పేర్కొన్నారు. ప్రతి సోమవారం తమ సంఘం ఆధ్వర్యంలో అన్నప్రసాద సేవా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో శివోహం అన్నప్రసాద సేవా సంఘం ఉపాధ్యక్షుడు మురుకూటి సూర్యనారాయణరెడ్డి, సభ్యులు విష్ణు నారాయణ, లింగారెడ్డి, జగన్ మోహన్ రెడ్డి, దేవానంద్ పాల్గొన్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం

ప్రొద్దుటూరు : స్థానిక బాకరాపేట వీధిలోని ఓ ఇంటిలో నిల్వ ఉంచి తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని సోమవారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. రేషన్ బియ్యాన్ని ప్రభుత్వ బస్తాల నుంచి ప్లాస్టిక్ బస్తాల్లోకి మార్చి వ్యాన్‌లో తరలిస్తుండగా ఆకస్మికంగా పోలీసులు దాడులు చేసి వ్యాన్‌తో సహా బియ్యం బస్తాలను పట్టుకున్నారు. అనంతరం శ్రీనివాసనగర్‌లోని రాఘవేంద్ర స్కూల్ సమీపంలో రేషన్ బియ్యం తరలిస్తుండగా పట్టుకునేందుకు ప్రయత్నించినా దొరకలేదని సమాచారం. ఈ విషయంపై పౌరసరఫరాల శాఖ డిప్యూటీ తహసీల్దార్ శివప్రసాద్‌ను వివరణ కోరగా బాకరాపేట వీధిలో పోలీసులు రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్న మాట వాస్తవమేనని తనకు ఇంకా సమాచారం అందలేదన్నారు. సుమారు 70 బస్తాలు ఉన్నట్లు తమకు సమాచారం అందిందన్నారు.

వాలీబాల్ పోటీలు ప్రారంభం

కలసపాడు : మండలంలోని పుల్లారెడ్డిపల్లెలో సోమవారం మేరీమాత ఉత్సవాల సందర్భంగా పుల్లారెడ్డిపల్లె గ్రామ యూత్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలను ముసల్‌రెడ్డిపల్లె గ్రామానికి చెందిన పెద్దిరెడ్డి రామకృష్ణారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు మానసిక, శారీరక ఆరోగ్యానికి ఎంతగానో దోహదపడతాయన్నారు. గెలుపు, ఓటములు సమానంగా భావించి క్రీడాకారులు క్రీడాస్ఫూర్తిని చాటాలన్నారు. పోటీల్లో 8 జట్లు పాల్గొన్నారు. మంగళవారం కూడా పోటీలు కొనసాగుతాయని అన్నారు. క్రీడాకారులకు భోజన వసతి కల్పించారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు పురపాలక సంఘం అత్యవసరం సమావేశం మంగళవారం మధ్యాహ్నం 3.30 గంటలకు నిర్వహించనున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి తెలిపారు. సమావేశంలో అజెండాలో పొందుపరిచిన అంశాలపై చర్చించి నిర్ణయం తీసుకుంటామని ఆమె పేర్కొన్నారు. ఈ సమావేశానికి కౌన్సిల్ సభ్యులు, అధికారులు తప్పక హాజరు కావాలని కోరారు.

గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

పోరుమామిళ్ల : పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న హిస్టరీ లెక్చరర్ పోస్టుకు అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ టి.శ్యామ్యూల్‌డేవిడ్‌రాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు పీజీలో హిస్టరీ సబ్జెక్టులో 55 శాతం మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలని, కంప్యూటర్ పరిజ్ఞానం తప్పనిసరి అని అన్నారు. అనుభవం, నెట్, సెట్ మరియు పీహెచ్‌డీ ఉన్న వారికి అధిక ప్రాధాన్యత ఇస్తామని, అర్హులైన వారు ఈ నెల 10 వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు కళాశాల ఆఫీసులో బయోడెటా, సర్టిఫికెట్ జిరాక్స్ కాపీలను అందజేయాలని, వివరాలకు 9052287046 నెంబరును సంప్రదించాలని కోరారు.

డీడీఓకు ఘన సన్మానం



రామకృష్ణయ్యను సన్మానిస్తున్న ఎంపీపీ, అధికారులు

దువ్వూరు : సత్యసాయి జిల్లా పెనుగొండ డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్‌గా పదోన్నతి పొంది బదిలీపై వెళుతున్న దువ్వూరు ఎంపీడీఓ పి.రామకృష్ణయ్యకు సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ కానాల జయచంద్రారెడ్డి, పంచాయతీ కార్యదర్శులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీపీ, ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు మాట్లాడుతూ దువ్వూరు ఎంపీడీఓ రామకృష్ణ బాధ్యతలు చేపట్టిన అనతి కాలంలోనే ప్రజా సమస్యలను పరిష్కరిస్తూ మండల అభివృద్ధికి కృషి చేశారన్నారు. డీడీఓ రామకృష్ణయ్య మాట్లాడుతూ ఇన్నాళ్లు తనకు సహకరించిన ఎంపీపీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులకు, రాజకీయ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం డీడీఓ రామకృష్ణయ్యకు పూలమాల, శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు బోరెడ్డి వెంకటరమణారెడ్డి, పాపినేని రాంబాబు, దువ్వూరు సర్పంచ్ చెంగ్రాయుడు, తహసీల్దార్ సంజీవరెడ్డి, డిప్యూటీ ఎంపీడీఓ హరికృష్ణ, మండల ఇంజనీర్ సుబ్రహ్మణ్యం, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శివకుమార్, వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

రైతుల సంక్షేమాన్ని విస్మరించిన కూటమి ప్రభుత్వం



బద్వేలు అర్బన్: అన్నదాతపోరు పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధ, నాయకులు



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

బద్వేలు అర్బన్ : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రైతు సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందని బద్వేలు ఎమ్మెల్యే డాక్టర్ సుధ పేర్కొన్నారు. రైతన్నలకు అండగా మంగళవారం నిర్వహించనున్న అన్నదాత పోరు కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను సోమవారం ఎన్‌జీవో కాలనీలోని ఎమ్మెల్యే కార్యాలయంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున రైతులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి గురుమోహన్, మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, మున్సిపాలిటీ అధ్యక్షుడు సుందర్‌రామిరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్లు గోపాలస్వామి, సాయిక్రిష్ణ, బూత్ కన్వీనర్ల విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యద్దారెడ్డి, నగర విభాగం రాష్ట్ర అధ్యక్షుడు బంగారుశీనయ్య, మండల కన్వీనర్ మల్లేశ్వర్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి బ్రహ్మానందరెడ్డి, మున్సిపాలిటీ నాయకులు శివరామకృష్ణయ్య పాల్గొన్నారు.

రైతన్నలకు అండగా వైఎస్సార్‌సీపీ

అట్లూరు : కూటమి ప్రభుత్వం అన్నదాతలకు తీరని అన్యాయం చేస్తోందని, ఎరువులు అందించకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వారికి వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ, వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవసాని ఆదిత్య రెడ్డి తెలిపారు. సోమవారం పోరుమామిళ్ల వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం యూరియాను రైతులకు అందించడంలో విఫలమైందన్నారు. యూరియాను ప్రభుత్వం సరఫరా చేయకపోవడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో పడ్డారన్నారు. మాజీ సీఎం, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు అన్నదాత పోరు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రైతన్నలకు ధైర్యం కల్పించేందుకు మంగళవారం ఉదయం 9 గంటలకు బద్వేలు పట్టణంలోని జెడ్పీ హైస్కూల్ వద్ద ధర్నా నిర్వహిస్తామన్నారు. అనంతరం ర్యాలీగా ఆర్డీఓ కార్యాలయానికి వెళ్లి అక్కడ ఆర్డీఓకు వినతి పత్రం అందిస్తామన్నారు. బద్వేలు మున్సిపాలిటీతో పాటు బద్వేలు రూరల్, పోరుమామిళ్ల, కలసపాడు, కాశినాయన, బి.కోడూరు, అట్లూరు, గోపవరం మండలాల్లోని రైతులు, వైఎస్సార్‌సీపీ ఎంపీపీలు, జెడ్పీటీసీలు, సర్పంచ్‌లు, వార్డు మెంబర్లు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలి వచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

అన్నదాత పోరును విజయవంతం చేయండి

కలసపాడు : బద్వేలులో మంగళవారం జరిగే అన్నదాత పోరును విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సగిలి సుదర్శన్, సూదా రామకృష్ణారెడ్డి తెలిపారు. సోమవారం కలసపాడులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో అన్నదాత పోరు పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యూరియాతో సహా రైతులకు అవసరమైన ఎరువులను వెంటనే పంపిణీ చేయాలని, బ్లాక్ మార్కెట్‌ను నియంత్రించి ఎరువులను పక్కదారి పట్టిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని, పంటలకు గిట్టుబాటు ధర, ఉచిత పంటల బీమాను పునరుద్ధరించాలని, వర్షాల కారణంగా దెబ్బతిన్న రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పురుషోత్తంరెడ్డి, ఎ.వి.భాస్కర్‌రెడ్డి, పులివీరారెడ్డి, కె.సుబ్బారెడ్డి, సింగరయ్య, సురేష్, రాంబాబు, మదుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అన్నదాత పోరును జయప్రదం చేయండి

ప్రొద్దుటూరు : అన్నదాతలకు అవసరమైన ఎరువులను సరఫరా చేయాలని కోరుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహిస్తున్న అన్నదాత పోరు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి కోరారు. ఆయన సోమవారం మీడియాతో మాట్లాడుతూ రైతులకు ఎరువులు సరఫరా చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. తమ ప్రభుత్వ హయాంలో ఎప్పుడు రైతులు ఎరువుల కోసం క్యూలో నిల్చోలేదని, ఆ పరిస్థితి కూటమి ప్రభుత్వంలో మాత్రమే ఏర్పడిందన్నారు. రైతులకు న్యాయం చేయాలని కోరుతూ నిర్వహించతలపెట్టిన అన్నదాత పోరు కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ శ్రేణుల తోపాటు రైతులు హాజరై జయప్రదం చేయాలని కోరారు. ఉదయం 9 గంటలకు మున్సిపల్ కార్యాలయం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహిస్తామని తెలిపారు. రైతు సమస్యలపై చేస్తున్న ఈ కార్యక్రమానికి అందరు మద్దతు తెలిపాలని కోరారు.

రైతు వ్యతిరేక విధానాలకు ముల్యం తప్పదు

ఖాజీపేట : కూటమి ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలు అవలంబిస్తోంది.. దీని ఫలితంగా కూటమి ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని వైఎస్సార్ సీపీ జిల్లా జనరల్ సెక్రటరీ పీపీ రాఘవ రెడ్డి, మండల కన్వీనర్ మురళీమోహన్‌రెడ్డి, రైతు విభాగం అధ్యక్షుడు నాగిరెడ్డి విమర్శించారు. సోమవారం వారు విలేకరులతో మాట్లాడుతూ రైతులకు యూరియా అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు దీనికి కారణం ప్రభుత్వం ముందు చూపు లేక పోవడమే అన్నారు. రైతులకు కావాల్సిన యూరియా సరఫరా చేయడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలం చెందిందన్నారు. క్రాప్ ఇన్స్‌రెన్స్‌లో కఠిన మైన నిబంధనలు పెట్టి రైతులకు ఇన్సురెన్స్ అందకుండా చేశారన్నారు. చుక్కల భూముల విషయంలో రైతులు తీవ్ర అన్యాయానికి గురి అవుతున్నారన్నారు. డీకేటీ భూములు ఉన్న రైతులు క్రాప్ ఇన్సురెన్స్ కోసం వెళితే వెబ్ ల్యాండ్‌లో కనిపించడం లేదన్నారు.



కలసపాడులో అన్నదాత పోరు పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ర్యాలీని జయప్రందం చేయండి

మైదుకూరులో తల పెట్టిన అన్నదాతపోరు ర్యాలీలో రైతులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

ఏపీజీబీ సేవలను వినియోగించుకోండి



రైతుకు వరి కోత మిషన్ అందిస్తున్న ఆర్ఎం సుశాంత్ కుమార్ స్వారో, అధికారులు

దువ్వూరు : ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు సేవలను ప్రజలు వినియోగించుకుని ఆర్థిక అభివృద్ధి సాధించాలని రీజనల్ మేనేజర్ సుశాంత్ కుమార్ స్వారో తెలిపారు. సోమవారం రూ.40లక్షల క్రాప్ హార్వేస్టర్ వరి కోత మిషన్‌ను ఏపీజీబీ ద్వారా ఫైనాన్స్ చేసి గుడిపాడు గ్రామానికి చెందిన బోరెడ్డి కొండారెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా రీజనల్ మేనేజర్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో గ్రామీణ బ్యాంకులన్నీ విలీనమై ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్‌కు అవతరించిందన్నారు. మా బ్యాంక్‌లో పర్సనల్, కమర్షియల్ రుణాలు, స్కూటర్లు, కార్లు, ట్రాక్టర్లకు రుణాలు అందిస్తామన్నారు. ప్రజలు వీటిని వినియోగించుకుని బ్యాంక్ ఉన్నతికి తోడ్పాటు అందించాలన్నారు. కార్యక్రమంలో ఏపీజీబీ క్రెడిట్ ప్రాసెసింగ్ హెడ్ మనోజ్ కుమార్, దువ్వూరు బ్రాంచ్ మేనేజర్ రమణ, గుడిపాడు బ్రాంచ్ మేనేజర్ నాగేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాన్ని అక్కడే కొనసాగించాలి

గోపవరం : మండలంలోని బొడ్డెవెర్లలో ఉన్న 272 పోలింగ్ కేంద్రాన్ని అక్కడే కొనసాగించాలని స్థానికులు సోమవారం ఆర్డీఓ చంద్రమోహన్, తహసీల్దారు త్రిభువన్‌రెడ్డిలకు వినతిపత్రం అందజేశారు. సోమశిల వెనుకజలాల కింద ముంపునకు గురయ్యే బొడ్డెవెర్ల, వడ్డెపాలెం దళితవాడలకు నష్టపరిహారం చెల్లించాలని, ఇంకా భూములకు నష్టపరిహారం చెల్లించాల్సి ఉందన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో 272 పోలింగ్ కేంద్రాన్ని బ్రాహ్మణపల్లె గ్రామ పంచాయతీ పరిధిలోని అడుసువారిపల్లెలో ఉన్న 271 పోలింగ్ కేంద్రంలో కలపాలని అధికారులు ప్రయత్నిస్తున్నారని వారు ఆ వినతిపత్రంలో పేర్కొన్నారు. అదే జరిగితే ముంపు గ్రామాల్లో ఉన్న తామంతా మూడు కిలోమీటర్లు నడిచి వెళ్ళి తమ ఓటుహక్కును వినియోగించుకోవాల్సిన పరిస్థితి ఉందన్నారు. ఇప్పటికే పూర్తిస్థాయిలో ముంపు గ్రామాలకు నష్టపరిహారం ఇవ్వకపోవడంతో ముంపు బాధితులంతా ఆ గ్రామాల్లోనే నివాసం ఉంటున్నామని తెలిపారు. పూర్తిస్థాయిలో నష్టపరిహారం చెల్లిస్తే తాము అక్కడ నుండి మరోచోటికి వెళతామని, ఆ తర్వాతనే పోలింగ్ కేంద్రాన్ని మార్చుకోవాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు.

అక్షరాస్యతతోనే దేశాభివృద్ధి సాధ్యం



రెడ్డికొట్టాల ఎస్టీ కాలనీలో విద్యార్థుల తల్లులతో ఉపాధ్యాయురాలు రాధిక

కలసపాడు : దేశ ప్రజలందరూ విద్యావంతులైనప్పుడే దేశాభివృద్ధి సాధ్యమని ఎస్టీయూ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి పి.రమణారెడ్డి, ఎంఈఓలు మస్తాన్‌వలి, ప్రేమ్‌సాగర్ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని దూలంవారిపల్లె మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో నిర్మించిన మరుగుదొడ్లను ప్రారంభించడంతో పాటు మొక్కలను నాటారు. కార్యక్రమంలో తెల్లపాడు జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు ఆర్.ఎస్.వి.ప్రసాదరెడ్డి, దూలంవారిపల్లె పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్.శివారెడ్డి, ఎస్టీయూ మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సి.వెంకటరెడ్డి, బి.ఎస్.వి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అక్షరాస్యతే ప్రతి మనిషికి ఆభరణం

బి.కోడూరు : ప్రతి మనిషికి అక్షరాస్యతే నిజమైన ఆభరణమని ఎంఈఓ గాజులపల్లె రాజశేఖరరెడ్డి తెలిపారు. సోమవారం మండలంలోని రామసముద్రం ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రమణమూర్తి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులతోపాటు తల్లులకు చదువు

కాశినాయన : మండలంలోని రెడ్డికొట్టాలు ఎస్టీ కాలనీ ఉపాధ్యాయురాలు, జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత నెమల్లదిన్నె రాధిక అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం పురస్కరించుకుని సోమవారం పిల్లలతోపాటు వారి తల్లిదండ్రులకు కూడా అక్షర జ్ఞానం నేర్పించాలని తలంచారు. ఇందులో భాగంగా సోమవారం పాఠశాల ముగిసిన తర్వాత గంట పాటు పిల్లల తల్లులను పాఠశాలకు పిలిపించి నిరక్షరాస్యులైన వారికి పలకలు, బలపాలు పంపిణీ చేసి చదువు నేర్పించారు. మహిళల చదువుకు శ్రీకారం చుట్టడంపై రాష్ట్రపతి అవార్డు గ్రహీత దాదాపీర్, ఎస్టీయూ నాయకులు రవీంద్ర బాబు, ప్రదీప్ హర్షం వ్యక్తం చేశారు.

దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించాలి

బద్వేలు అర్బన్ : రాష్ట్రంలోని దివ్యాంగులందరికి ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని దివ్యాంగుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఇండ్ల ఓబులేసు, సీపీఐ పట్టణ కార్యదర్శి పి.బాలు పేర్కొన్నారు. దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించాలని కోరుతూ సోమవారం స్థానిక ఆర్టీసీ డీఎం కార్యాలయం ఎదుట దివ్యాంగులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజంలో అన్నిరకాలుగా వెనుకబడిన దివ్యాంగులకు ఆర్టీసీ బస్సుల్లో ప్రస్తుతం ఇస్తున్న అర్ధ ఛార్జీకి బదులుగా పూర్తిగా ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని కోరారు. అనంతరం ఆర్టీసీ డీఎం నిరంజన్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో దివ్యాంగుల పోరాట సమితి పట్టణ అధ్యక్షుడు రఫి, కార్యదర్శి మౌలాలి, ఏరియా అధ్యక్షుడు బాలరాజు, మహిళా సంఘం అధ్యక్షురాలు నాగమణి, గౌరవ ఆహ్వానితులు మురళి, నాయకులు ఖాదర్‌బాష, గురవయ్య, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

టైమింగ్స్ పాటించక ప్రయాణికులకు అవస్థలు



గిద్దలూరు బస్సును చుట్టుముట్టిన ప్రయాణికులు

మైదుకూరు : అసలే సాయంత్రం వేళ మైదుకూరు బస్టాండ్‌లో రద్దీ ఎక్కువగా ఉంటుంది. దానికి తోడు గిద్దలూరు సర్వీసు బస్సులు టైమింగ్స్ పాటించకపోవడంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. సోమవారం సాయంత్రం ఒకదాని వెంట ఒకటి నాలుగు బస్సులు వరుసగా వచ్చి వెళ్లిపోయాయి. ప్లాట్‌ఫారం పైకి 6 గంటలకు మరో గిద్దలూరు బస్సు వచ్చేసరికి ప్రయాణికుల సంఖ్య పెరిగిపోయి ఒక్క సారిగా బస్సును చుట్టుముట్టారు. ముందే మహిళలకు ఫ్రీ కావడంతో డోర్ వద్ద మహిళా ప్రయాణికులను గమనించిన ఓ వ్యక్తి వీళ్లంతా ఎక్కితే నాకు సీట్ ఉంటుందో లేదో అని ఏకంగా కిటికీలో నుంచి బస్సు ఎక్కడం కనిపించింది. గిద్దలూరు, మైదుకూరు డిపోల నుంచి నడిచే గిద్దలూరు సర్వీస్ బస్సులు సమయపాలన పాటించకనే తాము అవస్థలు పడాల్సి వస్తోందని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. అధికారులు బస్సులన్నీ ఒకే సారి రాకుండా చూడాలని వారు కోరుతున్నారు.

రేపు జాబ్ మేళా

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక మైదుకూరు రోడ్డులోని నాగార్జున ఐటీఐ కాలేజీలో బుధవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ సుబ్బారావు ఒక ప్రకటనలో తెలిపారు. కొప్పర్తిలోని ఏఐఎల్ డిక్సాన్ టెక్నాలజీ లిమిటెడ్ వారు సీసీ కెమెరాల తయారీ విభాగంలో పనిచేసేందుకు ఈ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, డిప్లొమా, బీటెక్ పూర్తి చేసి 19 నుంచి 32 సంవత్సరాల వయసు గల అభ్యర్థులు అర్హులని తెలిపారు. వేతనం రూ.12,500 నుంచి రూ.18వేలు ఉంటుందని, జాబ్ మేళాకు హాజరయ్యే అభ్యర్థులు తమ ఆధార్ కార్డు, మార్కులిస్టు, బ్యాంక్ అకౌంట్ జిరాక్స్, పాన్ కార్డు, 2 పాస్‌పోర్టు సైజు ఫొటోలు తీసుకురావాలని సూచించారు.

వీరభద్ర స్వామి దేవస్థానం చైర్మన్‌గా వీరనారాయణ యాదవ్

చాపాడు : ప్రముఖ పుణ్యక్షేత్రమైన అల్లాడుపల్లె శ్రీ వీరభద్ర స్వామి దేవస్థానం పాలకమండలి చైర్మన్‌గా మండలంలోని అల్లాడుపల్లెకు చెందిన పెరుగు వీరనారాయణ యాదవ్ నియమితులయ్యారు. ఈ మేరకు పాలక వర్గాన్ని నియమిస్తూ దేవదాయశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. చైర్మన్‌గా వీరనారాయణ యాదవ్, కమిటీ సభ్యులుగా ఆర్.వీరారెడ్డి, జి.వీరారెడ్డి, పి.పార్వతి, కె.ఆదిలక్ష్మమ్మ, పావని, చెన్నమ్మ, గుర్రమ్మ, ఓం మహేశ్వరరెడ్డి, జగన్నాథ్ రెడ్డి, ఎక్స్ అఫిషియో మెంబర్‌గా వేదపండితులు నరేంద్ర శర్మలను నియమించినట్లు ఆలయ ఈఓ శ్రీనివాసులు తెలిపారు.

అన్నదానం : ప్రముఖ పుణ్యక్షేత్రమైన అల్లాడుపల్లెలో వీరభద్రస్వామి దేవస్థానం సన్నిధిలో సోమవారం ఉదయం 7 గంటలకు చంద్రగ్రణం అనంతరం ఆలయ సంప్రోక్షణ చేసి స్వామిని భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయ ప్రాంగణంలో పల్లకీ సేవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం ఆలయ సన్నిధిలోని శ్రీ భద్రకాళి సమేత వీరభద్ర స్వామి అన్నదాన సత్రంలో సీతారామాపురం గ్రామానికి చెందిన వర్రా చంద్రమోహన్‌రెడ్డి, వర్రా చంద్ర ప్రతాప్‌రెడ్డి కుటుంబీకులు భక్తులకు అన్న ప్రసాద వితరణ జరిపించారు. వల్లూరు మండలం తప్పెట్ల గ్రామానికి చెందిన దివంగత రేనాటి సుబ్బారెడ్డి, పార్వతమ్మల జ్ఞాపకార్థం వారి కుటుంబీకులు శాశ్వత అన్నదానానికి రూ.లక్ష, భక్తులు కానుక రూపంలో రూ.7,975 స్వామివారికి ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ శ్రీనివాసులు తెలిపారు.

యూరియా కోసం రైతుల పడిగాపులు



మైదుకూరు డీటీకి వినతి పత్రం అందిస్తున్న సీపీఐ నాయకులు



తహసీల్దారు కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు

దువ్వూరు : మండలంలో సోమవారం యూరియాను పంపిణీ చేశారు. ఉదయం 6 గంటల నుంచి రైతులు దువ్వూరులోని మన గ్రోమోర్, ఇతర ఎరువుల దుకాణాల్లో, రైతు సేవా కేంద్రాల వద్ద యూరియా కోసం రైతులు క్యూలో నిలబడి పడిగాపులు కాశారు. ఎండకు దాదాపు 5 గంటలపాటు క్యూలో ఉన్నా చాలా మంది రైతులకు యూరియా అందక నిరాశగా వెనుదిరిగారు. దువ్వూరు మండలంలో సోమవారం 72 టన్నుల యూరియా పంపిణీ చేశామని, అందులో దువ్వూరు, చింతకుంట, ఏఎస్ పల్లి, కృష్ణంపల్లె రైతు సేవా కేంద్రాలకు 40 టన్నులు, మన గ్రోమోర్ సెంటర్‌కు 12.5 టన్నులు, ఇతర ప్రైవేట్ ఫర్టిలైజర్ షాపులకు 20 టన్నుల యూరియాను రైతులకు పంపిణీ చేసినట్లు వ్యవసాయాధికారులు తెలిపారు. కానీ క్షేత్రస్థాయిలో అధికారులు చెప్పిన దానికి భిన్నంగా యూరియా పంపిణీ జరిగింది. దువ్వూరు మన గ్రోమోర్ సెంటర్ వద్ద ఉదయం 5 గంటల నుంచే రైతులు యూరియా కోసం బారులు తీరారు. రైతులకు టోకెన్లు పంపిణీ చేసిన మన గ్రోమోర్ సిబ్బంది కొంత మంది రైతులకు యూరియాను ఇచ్చి మిగతా యూరియాను టోకెన్లు లేని తమకు అనుకూలమైన వ్యక్తులకు ఒక్కొక్కరికి 10 బస్తాలు చొప్పున యూరియా ఇచ్చారు. క్యూలో ఉన్న రైతులు మన గ్రోమోర్ సిబ్బందిని ప్రశ్నించగా రైతులపై మా ఇష్టం ఎవరికి చెప్పుకుంటారో చెప్పుకోండి అని, యూరియా లేదని నిర్లక్ష్యంగా సమాధానం చెప్పారు. రైతులు మన గ్రోమోర్ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంపై ఏఓ అమరనాథరెడ్డిని వివరణ కోరగా యూరియా డిమాండ్ ఉన్న మాట వాస్తవమేనని, డిమాండ్ ఉన్నప్పుడు కొన్ని పొరపాట్లు జరగడం సహజమని, రైతులకు అవసరం లేకున్నా ఎక్కువ యూరియాను వినియోగించి పంటలకు వేస్తున్నారన్నారు. ఇది తీవ్రంగా నష్టం చేస్తుందని తెలిపారు.

యూరియా కొరతపై సీపీఐ ధర్నా

మైదుకూరు : రైతులకు సరిపడా యూరియాను ప్రభుత్వం సరఫరా చేయడం లేదని ఆరోపిస్తూ సీపీఐ నాయకులు సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం యూరియాను రైతులకు అందుబాటులో ఉంచాలని, కొరతను వెంటనే తీర్చాలని కోరుతూ డిప్యూటీ తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పి.శ్రీరాములు, మైదుకూరు నియోజకవర్గ కార్యదర్శి పోతిరెడ్డి భాస్కర్, ఏఐటీయూసీ మైదుకూరు నియోజకవర్గ కార్యదర్శి ఏవీ శివరాం మాట్లాడుతూ మైదుకూరు నియోజకవర్గంలో కేసీ కెనాల్ కింద వేసిన వరి ఏపుగా పెరిగి మంచి దిగుబడి రావాలంటే యూరియా అవసరమని తెలిపారు. రైతులు యూరియా కోసం రైతు సేవా కేంద్రాల దగ్గర, సొసైటీల దగ్గర పడిగాపులు కాస్తున్నా యూరియా లభించడం లేదన్నారు. ఎరువుల దుకాణాల్లో బ్లాక్‌లో రూ.350–400కు తక్కువ కాకుండా అమ్ముతున్నారని ఆరోపించారు. అధిక ధరలకు అమ్ముతున్న దుకణాలపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. సీపీఐ మైదుకూరు పట్టణ కార్యదర్శి డి.సుబ్బరాయుడు, నియోజకవర్గ కార్యవర్గ సభ్యులు జి.రవి, పి.శంకర్, ఏపీ రైతు సంఘం నాయకులు గోశెట్టి రామ్మూర్తి, కొమ్మినేని లక్ష్మయ్య, గోశెట్టి రామయ్య, బీపీ రాజా పాల్గొన్నారు.

ఎన్ని ఎకరాలున్నా యూరియా ఒక బస్తానే..

చాపాడు : ఒక రైతుకు ఎన్ని ఎకరాల భూములు ఉన్నా ఇచ్చేది ఒక బస్తానే.. దీంతోనే సరిపెట్టుకోవాలి. పైనుంచి యూరియా బస్తాలు వస్తేనే మళ్లీ ఇస్తామని, మా చేతుల్లో ఏమీ లేదని వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు తేల్చి చెబుతున్నారు. చాపాడు మండలం చిన్నగురవలూరులో సోమవారం యూరియా పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సచివాలయ పరిధిలో చిన్న గురువలూరు, గాంధీనగరం, కుచ్చుపాప గ్రామాలున్నాయి. ఈ సచివాలయ పరిధిలో ఇప్పటికే వరి సాగును రైతులు పూర్తి చేసుకున్నారు. పైరు పెట్టి నాలుగు వారాలు అవుతున్నప్పటికీ యూరియా చల్లలేదని, ఎకరాకు ఒక బస్తా తప్పనిసరిగా వేయాలని రైతులు వ్యవసాయాధికారులను కోరుకుంటున్నారు. అయినప్పటికీ పై నుంచి యూరియా బస్తాలు తక్కువగా వచ్చాయని ఒక్కో బస్తా మాత్రమే ఇస్తామని అధికారులు తేల్చి చెప్పారు. దీంతో చేసేదేమి లేక ఉదయం నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు క్యూ లైన్‌లో నిలబడి రైతులు ఒక్కో యూరియా బస్తా తీసుకెళ్లాల్సిన దుస్థితి ఏర్పడింది.

యూరియా సమస్యను పరిష్కరించాలని వినతి

మండల వ్యాప్తంగా రైతులను యూరియా సమస్య తీవ్రంగా వేధిస్తోందని, ఈ సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సోమవారం సీపీఐ మైదుకూరు నియోజకవర్గ కార్యదర్శి పోతిరెడ్డి భాస్కర్, మండల కార్యదర్శి రామాంజనేయులు రైతులతో కలసి తహసీల్దార్ రమాకుమారిని కలిసి వినతి పత్రం అందజేశారు. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని తహసీల్దార్‌ను కోరారు.

యూరియా అందించడంలో ప్రభుత్వం విఫలం

బద్వేలు అర్బన్ : రైతన్నలకు సకాలంలో యూరియాను అందించడంలో కూటమి ప్రభుత్వం విఫలం చెందిందని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు వి.వీరశేఖర్, రూరల్ కార్యదర్శి ఇమ్మానియేల్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక తహసీల్దారు కార్యాలయం ఎదుట సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రం నుండి వస్తున్న యూరియాలో 80 శాతం ప్రైవేటు ఎరువుల దుకాణాలకు తరలిస్తూ 20 శాతం మాత్రమే రైతుసేవా కేంద్రాలకు, ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలకు అందుతోందని ఆరోపించారు. సీపీఐ పట్టణ సహాయ కార్యదర్శి నాగరాజు, మండల నాయకులు సుబ్బారెడ్డి, సుధాకర్, రమణయ్య, ప్రసాద్ పాల్గొన్నారు.

యూరియా కొరత తీర్చాలి

పోరుమామిళ్ల : రాష్ట్రంలో యూరియా కొరత తీర్చాలని, ఎరువుల కేటాయింపులో రైతుసేవా కేంద్రాలు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు ప్రాధాన్యత ఇవ్వాలని, అధిక ధరలకు విక్రయించే డీలర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని సీపీఐ మండల కార్యదర్శి రవికుమార్, సహాయ కార్యదర్శి కేశవ డిమాండ్ చేశారు. సోమవారం యూరియా కొరతను తీర్చాలని కోరుతూ స్థానిక తహసీల్దారు కార్యాలయం ఎదుట సీపీఐ నాయకులు నిరసన చేపట్టారు. కార్యక్రమంలో సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు పీరయ్య, శ్రీనివాసులు, చెన్నయ్య, రంగాచారి, గురమ్మ, జ్యోతి, ఆదేమ్మ, విశ్వాసమ్మ, షాహిదా తదితరులు పాల్గొన్నారు.

రైతులందరికి యూరియా అందించాలి

ప్రొద్దుటూరు : యూరియా కొరతను పరిష్కరించి రైతులందరికి యూరియా అందించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బి.రామయ్య, పట్టణ కార్యదర్శి సుబ్బరాయుడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. యూరియా కొరతను తీర్చాలని సోమవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ఏడాది ఇదే సీజన్‌లో యూరియా కొరత సమస్య లేదని, ఈ ఏడాది మాత్రమే యూరియా సమస్య తీవ్రంగా ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం యూరియా నిల్వలు ఉన్నాయని చెబుతున్నప్పటికీ రైతులకు అందడం లేదన్నారు. యూరియాను రైతులకు అందించడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. కేంద్రం నుంచి వచ్చిన యూరియాను 80 శాతం ప్రైవేట్ ఫర్టిలైజర్ షాపులకు, 20 శాతం రైతు సేవా కేంద్రాలకు, ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలకు సరఫరా చేస్తున్నారన్నారు. యూరియాను కూటమి నాయకులు అవసరానికి మించి తీసుకుపోతున్నారనే ఆరోపణలు ఉన్నాయన్నారు. ఒక బస్తా యూరియా (45 కేజీలు) రూ.266కు అమ్మాల్సి ఉండగా ప్రైవేట్ ఫరిటలైజర్ షాపుల వారు రూ.300 నుంచి రూ.400లకుపైగా అమ్మి సొమ్ము చేసుకుంటున్నారని అన్నారు. ఖరీఫ్ సీజన్‌లో ఎకరాకు 2 బస్తాల యూరియా అవసరమవుతుందని, కానీ ఒక బస్తా కూడా అందడం లేదన్నారు. సీపీఐ పట్టణ సమితి భ్యులు దేవరశెట్టి నరసింహ, మచ్చా శ్రీను, వసంతరావు, మద్దిలేటి, దస్తగిరి, ప్రమీల, పీటర్, గోవిందరెడ్డి, చైతన్య తదితరులు పాల్గొన్నారు.